సాక్షి
హనుమకొండ
శుక్రవారం । 18 । ఏప్రిల్ । 2025



రజతోత్సవ సభకు ఏర్పాట్లు
బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి సమీపంలో సభ కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. - 10లో▸



నిరంతరం కష్టపడితేనే విజయం
నిరంతరం కష్టపడితేనే విజయం వరిస్తుందని కేయూ వీసీ కె.ప్రతాప్ రెడ్డి అన్నారు. యూనివర్సిటీ కాలేజీ వార్షిక స్పోర్ట్స్ అండ్ కల్చరల్ డేలో మాట్లాడారు. - 10లో▸

గరిష్టం/కనిష్టం
40^0/26^0

వాతావరణం
జిల్లాలో ఉదయం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండతోపాటు ఉక్కపోత ఉంటుంది. సాయంత్రం సమయంలో ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

క్రీడా శిక్షణ శిబిరాలకు దరఖాస్తులు



వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండ డీఎస్ఏ ఆధ్వర్యంలో మే 1 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్న శిక్షణ శిబిరాలకు ఆసక్తి గల విద్యార్థుల నుంచి డీవైఎస్ఓ గుగులోత్ అశోక్‌కుమార్ గురువారం ఇండోర్ స్టేడియం వద్ద దరఖాస్తులు స్వీకరించారు. జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం వేదికగా 23 క్రీడాంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు అశోక్‌కుమార్ తెలిపారు. 4 వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ చదువుతున్న విద్యార్థుల వరకు క్రీడా శిబిరాలను వినియోగించుకోవాలని సూచించారు.

జిల్లాకు 20 మంది స్పౌజ్ టీచర్లు



విద్యారణ్యపురి: రాష్ట్రంలో 317 జీఓ ద్వారా నష్టపోయిన స్పౌజ్ టీచర్లలో మరో 165 మందిని బదిలీ చేస్తూ.. ప్రభుత్వం ఈనెల 16న ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా హనుమకొండ జిల్లాకు 20 మంది స్పౌజ్ టీచర్లను వివిధ జిల్లాల నుంచి బదిలీ చేశారు. భార్యాభర్తలను ఒకే జిల్లాకు బదిలీల్లో భాగంగా.. ఈ బదిలీలు జరిగాయి. భార్య ఒక జిల్లాలో భర్త మరో జిల్లాలో ప్రస్తుతం ఉండడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు హనుమకొండ డీఈఓకు బదిలీ అయిన స్పౌజ్ టీచర్ల జాబితాను పంపారు. ఆయా టీచర్లు ఈనెల 22న తాము ప్రస్తుతం పనిచేస్తున్న జిల్లా నుంచి రిలీవ్ అయ్యి ఈ విద్యాసంవత్సరం చివరి పనిదినమైన ఈనెల 23న హనుమకొండ జిల్లాలో కేటాయించిన పాఠశాలలో విధుల్లో చేరాల్సి ఉంటుంది. వివిధ జిల్లాల నుంచి హనుమకొండ జిల్లాకు బదిలీ అయిన 20 మందిలో ఎస్జీటీలు 16 మంది, ఎల్ఎఫ్ఎల్‌హెచ్ఎం ఇద్దరు, ఒకరు స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్, మరొకరు స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ ఉన్నారు.

సీనియర్ సివిల్ జడ్జిల బదిలీ

వరంగల్ లీగల్: రాష్ట్రవ్యాప్తంగా సీనియర్ సివిల్ జడ్జిలను బదిలీచేస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ గురువారం ఉత్తర్వులు విడుదల చేశారు. రంగారెడ్డి జిల్లా ఎల్‌బీనగర్ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి డి.విరోధిని వరంగల్ జిల్లా నర్సంపేటకు బదిలీ అయ్యారు. హనుమకొండ సీనియర్ సివిల్ జడ్జి జే.ఉపేందర్‌రావును 16వ అదనపు జడ్జిగా సిటీ సివిల్ కోర్ట్ సికింద్రాబాద్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఎల్‌బీ నగర్ 3వ అదనపు సివిల్ జడ్జి జి.రామలింగాన్ని నియమించారు. భూపాలపల్లి సీనియర్ సివిల్ జడ్జి కె.జయరామ్ రెడ్డిని రంగారెడ్డి జిల్లా కూకట్‌పల్లి సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేయగా.. ఆయన స్థానంలో రంగారెడ్డి జిల్లా ఎల్‌బీనగర్ 4వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కెనాగరాజును బదిలీ చేశారు. మహబూబాబాద్ జిల్లా సీనియర్ సివిల్ జడ్జి సి.సురేశ్‌ను ఫస్ట్ అదనపు జడ్జి సివిల్ సిటీ కోర్టు సికింద్రాబాద్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సంగారెడ్డి సీనియర్ సివిల్ జడ్జి శాలిని శభీలాను నియమించారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

హన్మకొండ: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ వరంగల్–1 డిపో మేనేజర్ పి.అర్పిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. హైదరాబాద్, నిజామాబాద్, కరీంనగర్, సిద్దిపేట, పాలకుర్తి, తరిగొప్పుల రూట్ ప్రయాణికులు 99592 26047 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు వివరించడంతోపాటు, సలహాలు, సూచనలు అందించాలని కోరారు.

21నుంచి ప్రత్యేక వ్యాధి నిరోధక టీకాలు

హసన్‌పర్తి: ఈ నెల 21నుంచి 28వ తేదీ వరకు వారంరోజుల పాటు జిల్లావ్యాప్తంగా ప్రత్యేక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి మహేందర్ తెలిపారు. హసన్‌పర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం వైద్యాధికారులు, సూపర్‌వైజర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మహేందర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ టీకాలు ఇచ్చిన వారి వివరాలు పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అతుల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్ సంజీవ్ బదిలీ

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఎస్‌బీ విభాగంలో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్ బి.సంజీవ్ కరీంనగర్ కమిషనరేట్‌లోని మానకొండూరు సర్కిల్‌కు బదిలీ అయ్యారు. మల్టీజోన్–1లో జరిగిన బదిలీల్లో మల్టీజోన్ ఐజీ దగ్గర వెయిటింగ్‌లో ఉన్న పైండ్ల మల్లయ్య వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు వచ్చారు.

ప్రయాణ ప్రయాస!

ప్రయాణికులకు నీడ కరువు
- ఎండైనా, వానైనా రోడ్లపైనే నిరీక్షణ
- జిల్లాలో బస్ షెల్టర్లు లేక ఇబ్బందులు



వేలేరు అంబేడ్కర్ సెంటర్‌లో ఎండలో..

హన్మకొండ: జిల్లాలో బస్ షెల్టర్లు లేక ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారు. బస్సుల కోసం రోడ్లపైనే పడిగాపులు కాస్తున్నారు. ఆర్టీసీ, స్థానిక సంస్థల మధ్య సమన్వయం కొరవడడం, స్థల సమకూర్పు వంటి కారణాలతో బస్‌షెల్టర్లు నిర్మాణానికి నోచుకోవట్లేదు. స్థలం కేటాయిస్తే బస్ స్టేషన్లు, షెల్టర్లు నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆర్టీసీ అధికారులు చెబుతుండగా.. గ్రామాల్లో స్థలాన్ని సమకూర్చడంలో స్థానిక సంస్థలు ముందుకు రావట్లేదనే ఆరోపణలున్నాయి. మహిళలకు ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆర్టీసీకి ప్రయాణీకుల సంఖ్య పెరిగింది. దీంతో బస్ స్టేజీల వద్ద ప్రయాణీకుల రద్దీ కనిపిస్తోంది. అయినప్పటికీ కనీస సౌకర్యాలు కల్పించాలనే ఆలోచన పాలకులకు రావట్లేదు. జిల్లాలో బస్‌షెల్టర్లు లేక ప్రయాణికులు పడుతున్న అవస్థలపై 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్.

కమలాపూర్‌లో..

కమలాపూర్‌లో ఆర్టీసీ బస్టాండ్, బస్ షెల్టర్ లేదు. రోడ్ల వెంట నిలువ నీడ కూడా లేదు. దీంతో ప్రయాణికులు బస్సుల కోసం ఎండైనా, వానైనా వ్యాపార, వాణిజ్య దుకాణాల ఎదుట నిరీక్షిస్తున్నారు. గతంలో హుజూరాబాద్–పరకాల మార్గంలో కమలాపూర్ బస్టాండ్ ప్రాంతంలో బస్ షెల్టర్ ఉండగా.. ఫోర్ లేన్ నిర్మాణంలో భాగంగా దాన్ని తొలగించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఇక్కడ ఆర్టీసీ బస్టాండ్ నిర్మించకపోగా.. హుజూరాబాద్ అసెంబ్లీ ఉప ఎన్నికల అనంతరం రూ.1.71 కోట్లతో చేపట్టిన ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం నిధుల లేమితో అసంపూర్తిగా నిలిచిపోయింది. అసంపూర్తిగా నిలిచిన బస్టాండ్ కాస్తా ప్రస్తుతం వాహనాల పార్కింగ్ స్థలంగా మారింది.

ఆత్మకూరు మండలంలో..

ఆత్మకూరు మండలంలోని గూడెప్పాడ్ జంక్షన్‌లో బస్సు షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ జంక్షన్ నుంచి నిత్యం ప్రయాణికులు ములుగు ఏటూరునాగారం వైపు, హనుమకొండ, వరంగల్ వైపు, పరకాల భూపాలపల్లి మీదుగా కాళేశ్వరం వైపు అనేక మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉండడంతో తలదాచుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు.


కమలాపూర్‌లో దుకాణాల వద్ద..


గుడెప్పాడ్ కూడలిలో ఎండలో నిరీక్షణ

వేలేరులో..

వేలేరు నుంచి హనుమకొండ, ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు మండల కేంద్రంలో బస్టాండ్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పీచర, వేలేరు ఇతర గ్రామాల ప్రజలు బస్టాండ్ లేక ఎండకు, వానకు తడుస్తూ అవస్థలు పడుతున్నారు. బస్టాండ్ లేక షాపుల ఎదుట గంటల తరబడి బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. వివిధ పనులపై మండల కేంద్రానికి, బ్యాంకులకు వచ్చే మహిళా ప్రయాణీకులకు, బస్ షెల్టర్, టాయిలెట్ సౌకర్యం లేక వారు పడే బాధలు వర్ణనాతీతం.

ఐనవోలులో..

ఐనవోలులో బస్ షెల్టర్ లేక ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం, మల్లన్న ఆలయానికి వచ్చే ప్రజలు బస్‌స్టేషన్ లేక షాపులు, ఇతరుల ఇళ్ల ఎదుట నీడ చాటున నిల్చుని బస్సుల కోసం ఎదురు చూస్తున్నారు.





పరకాల: పైన కనిపిస్తున్న ఫొటోలో.. ఎర్రబెండలో రోడ్డు పక్కన నిల్చున్న ప్రయాణికులది పరకాల. పొరుగూరికి వెళ్లేందుకు అంబేడ్కర్ సెంటర్ వద్ద బస్సు కోసం ఎదురు చూస్తున్నారు. నిలబడేందుకు నీడ కూడా లేక హోటళ్లు, బేకరీలు, కిళ్లీకొట్ల వద్ద నిరీక్షిస్తున్నారు. కాగా.. పరకాల బస్టాండ్ తప్ప.. పట్టణంలో ఎక్కడ కూడా బస్టాప్ లేకపోవడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. పరకాల నుంచి హనుమకొండకు వెళ్లే దారిలోని అంబేడ్కర్ సెంటర్, ఎల్‌బీసీ కార్యాలయం వద్ద బస్టాప్‌లు ఉన్నాయి. కానీ.. ఆయా స్థలాల్లో బస్ షెల్టర్లు లేక, కనీసం కూర్చునేందుకు కుర్చీలు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉద్యోగులు, వృద్ధులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కొందరైతే నిలబడే ఓపిక లేక రోడ్డుపైనే కూర్చుంటున్నారు.

దుకాణాల ముందట కూసుంటానం..



నేను హుజూరాబాద్‌కు పోదామని పంగిడిపల్లి నుంచి కమలాపూర్‌కు వచ్చిన. ఇక్కడ బస్టాండ్ కాదు కదా.. కనీసం నీడ కూడా లేదు. ఎండలో నిలబడలేక ఇలా దుకాణాల ముందట కూసున్న. దుకాణాల ముందు మీరంతా కూసుంటె మాకు గిరాకీ ఎట్లస్తదని దుకాణపోళ్లు అంటాండ్లు.
– చెన్నూరి సత్యమ్మ

బస్టాండ్ ఏర్పాటు చేయాలి..



నూతన మండలంగా ఏర్పడి సుమారు 9 సంవత్సరాలైనప్పటికీ పాలకులు బస్టాండ్‌ను ఏర్పాటు చేయలేదు. ఐలోని మల్లికార్జునస్వామి కొలువై ఉండడంతో నిత్యం వందలాది మంది భక్తులు, జాతర సమయాల్లో వేలాదిగా భక్తులు వస్తుంటారు. భక్తుల, ప్రయాణికుల సౌకర్యార్థం అంబేడ్కర్, తెలంగాణ తల్లి సెంటర్ల వద్ద బస్టాండ్ ఏర్పాటు చేయాలి.
– నల్లబెట్ల చిన్న రాజు, ఐనవోలు

బస్ షెల్టర్ నిర్మించాలి..



గుడెప్పాడ్ జంక్షన్లో బస్ షెల్టర్ లేక ఇబ్బందులు పడుతున్నాం. ఎండలు కొడుతుండడంతో ఎండలో నిలబడాల్సి వస్తోంది. ఇప్పటికైనా బస్ షెల్టర్ నిర్మించాలి.
– నల్లెల్ల భిక్షపతి, ప్రయాణికుడు

దుకాణాల వద్ద కూర్చుంటున్నాం..



బస్టాండ్ వరకు నడవలేక అంబేడ్కర్ క్రాస్ వద్దనే బస్సు ఎక్కి హనుమకొండకు వెళ్తుంటాం. కానీ.. ఆర్టీసీ వాళ్లు మాత్రం నీడ కూడా ఏర్పాటు చేయట్లేదు.
– సూరయ్య, పరకాల

స్థలాలిస్తే బస్ షెల్టర్లు నిర్మిస్తాం..



గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక సంస్థలు బస్ షెల్టర్లు నిర్మించాలి. వారు నిర్మించకపోతే మాకు స్థలం కేటాయిస్తే మేమే బస్ స్టేషన్‌ను కానీ, బస్ షెల్టర్ కానీ నిర్మిస్తాం. ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించేందుకు ఆర్టీసీ ఎప్పుడూ ముందుంటుంది.
– డి.విజయభాను, ఆర్టీసీ ఆర్ఎం

సమస్యల పరిష్కారానికే 'భూ భారతి'

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- రైతులు వినియోగించుకోవాలి: కలెక్టర్ ప్రావీణ్య

ఐనవోలు: రైతులు ఎదుర్కొంటున్న భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో నూతన భూభారతి చట్టం తీసుకొచ్చినట్లు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తెలిపారు. సీఎం ఇచ్చిన హామీ మేరకు సమస్యలకు నిలయమైన ధరణి పోర్టల్‌ను తుంగలో తొక్కి నూతన చట్టాన్ని తీసుకొచ్చామని స్పష్టం చేశారు. గురువారం మండల కేంద్రంలోని శ్రీమల్లికార్జునస్వామి ఫంక్షన్ హాల్‌లో భూభారతి చట్టంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కలెక్టర్ ప్రావీణ్య హాజరయ్యారు. ముందుగా ఆర్డీఓ రాథోడ్ రమేశ్ ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నూతన చట్టంలోని అంశాలను క్షుణ్ణంగా రైతులకు వివరించారు. తెలంగాణ ప్రభుత్వం ముద్రించిన భూ భారతి చట్టానికి సంబంధించిన కరపత్రాన్ని రైతులకు అందజేశారు. సమస్యలు, సందేహాలున్న రైతులు మాట్లాడడానికి అవకాశం కల్పించారు. కొండపర్తి, వనమాలకనపర్తి, కక్కిరాలపల్లి, రాంనగర్, నాగపురం, లక్ష్మీపురం, పంథిని, ఒంటిమామిడిపల్లి తదితర గ్రామాల రైతులు సమస్యల్ని రెవెన్యూ అధికారుల, ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు గ్రామాల్లో రైతుల సమస్యలను రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకొచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కరించడానికి ధరణి పోర్టల్‌లో లేని అవకాశాలు ప్రస్తుత చట్టంలో ఉన్నాయన్నారు. రైతులు ఈ అవకాశాల్ని వినియోగించుకోవాలని సూచించారు. టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు మాట్లాడుతూ.. రైతుల భూ సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కారం లభించేలా నూతన చట్టాన్ని రూపొందించిన క్యాబినెట్ మంత్రులు, సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ విక్రమ్‌కుమార్, మండల స్పెషల్ ఆఫీసర్ అనురాధ, ఏఓ సునీల్‌కుమార్, ఎంపీడీఓ రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, చిత్రంలో కలెక్టర్ ప్రావీణ్య తదితరులు

ప్రొటోకాల్ ఉల్లంఘన..

నూతన భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు జరుగుతుండగా.. ఆర్డీఓ రాథోడ్ రమేశ్ చట్టం సమగ్ర రూపాన్ని రైతులకు వివరిస్తున్న క్రమంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కలుగజేసుకుని అధికార పార్టీకి చెందిన నాయకులను వేదికపైకి పిలిచి కూర్చోబెట్టారు. కలెక్టర్ సమక్షంలోనే ఇలా జరగ్గా అధికారులు ఖంగుతిన్నారు. కాగా.. సమావేశానికి హాజరైన వివిధ పార్టీల నాయకులు విశ్రాంత ఐపీఎస్ అధికారైన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు.. ప్రభుత్వ అధికారిక కార్యక్రమంలో పార్టీకి చెందిన నాయకులను వేదికపై కూర్చోబెట్టి ప్రొటోకాల్ ఉల్లంఘనకు పాల్పడడం దారుణమన్నారు. సభా సంప్రదాయాలకు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు విలువ ఇవ్వలేదనే అంశం మండలవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

కారు కిరాయి.. ఇంధనం పరాయి

- స్కాన్ చేసినట్లు యాక్షన్.. ఇంధనం క్యాన్లతో పరారు
- పెట్రోల్ బంకుల సిబ్బందిని బురిడీ కొట్టించి జల్సాలు
- మూడు బృందాలుగా ఆగడాలు.. పోలీసుల అదుపులో ఆకతాయిలు

సాక్షిప్రతినిధి, వరంగల్:

- పరకాలలోని హుజూరాబాద్ రోడ్డులో గల ఓ పెట్రోల్‌బంకులోకి గత నెల 25న స్కై బ్లూ రంగు గల కియా కారులో బంకులోకి వచ్చిన ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు క్యాన్లలో రూ.7,500 (78.67 లీటర్లు) డీజిల్ పోయించుకున్నారు. డబ్బులు ఇమ్మని అడగ్గా ఫోన్ పే చేస్తామని స్కాన్ చేశారు. డబ్బులు రాలేదని చెప్పగా.. వస్తాయని చెప్పి కారులో ఉడాయించగా పెట్రోల్ బంక్ మేనేజర్ ఈ నెల 12న పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- రాయపర్తిలో హెచ్‌పీ పెట్రోల్ బంకులోకి గత నెల 31న రాత్రి సుమారు 11.30 గంటల సమయంలో బ్లూ కలర్ బెలోనో కారు వెళ్లింది. అందులో ఉన్న ముగ్గురు వ్యక్తులు మూడు క్యాన్లతో డీజిల్ పోయించుకున్నారు. రూ.10,508 విలువైన 110.22 లీటర్ల డీజిల్ కొట్టించుకున్న సదరు వ్యక్తులు స్కానర్ ద్వారా పేమెంట్ చేసినట్లు చెప్పారు. డబ్బులు జమ కాలేదని చెప్పినా వినకుండా కారు స్టార్ట్ చేసుకుని వెళ్లారు. దీంతో ఆ బంకు క్యాషియర్ ఈ నెల 15న పోలీసులకు ఫిర్యాదు చేశారు.



పరకాలలోని పెట్రోల్ బంక్‌లో కియా కారులో క్యాన్లు పెట్టి డీజిల్ పోయించుకుంటున్న దుండగులు (సీసీ టీవీ ఫుటేజీ)

... ఇలా 25 రోజుల్లో సుమారు 25 బంకుల్లో డీజిల్, పెట్రోల్ దొంగిలించిన ఆకతాయిల వ్యవహారం వరంగల్ కమిషనరేట్ పోలీసులకు సవాల్‌గా మారింది. గత కొద్ది రోజులుగా ఆకతాయిలు కొందరు సెల్ఫ్ డ్రైవింగ్ వాహనాలను అద్దెకు తీసుకుని కారుతోపాటు క్యాన్లలో ఇంధనం తీసుకెళ్లి అమ్ముకుంటూ.. ఆ డబ్బుతో జల్సా చేయడం పరిపాటిగా మారింది. అత్యధికంగా పరకాల, దామెర, నడికూడ, రాయపర్తి, జఫర్‌గఢ్, రేగొండ, నల్లబెల్లి మండలాల్లోని బంకుల్లో ఈ తరహా దందాలకు పాల్పడినట్లు ఫిర్యాదులు ఉన్నాయి. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసిన పరకాల, రాయపర్తి పోలీసులు నిందితుల కోసం ఆరా తీయగా.. ఇంధనం దొంగల గుట్టురట్టయ్యింది. కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. సుమారు 12 మంది వరకు పనీపాట లేని యువకులు మూడు టీములుగా ఏర్పడి 'సెల్ఫ్ డ్రైవింగ్' వాహనాలను అద్దెకు తీసుకుని ఆ వాహనాల నంబర్ ప్లేట్లు తీసి పెట్రోల్ బంకుల్లో వెళ్లి ఇంధనం దొంగిలిస్తూ జల్సాలు చేస్తుండగా పోలీసులు వారి ఆటకట్టించినట్లు సమాచారం. మూడు టీములకు చెందిన సభ్యులను అరెస్ట్ చేసేందుకు సిద్ధమైన పోలీసులు అదుపులో ఉన్నవారినుంచి పూర్తి వివరాలు రాబడుతున్నట్లు సమాచారం. కాగా నేడో, రేపో నిందితులను అరెస్ట్ చూపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

డబ్బులు వసూలు చేస్తే జైల్లో పెట్టిస్తా..

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

శాయంపేట: ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే వారిపై కేసులు పెట్టించి జైలుకు పంపిస్తానని, ఇల్లులేని అర్హులకే ఇవ్వాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం ఇందిరమ్మ ఇళ్ల తుది జాబితా విడుదల చేయడానికి మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందించిందని గుర్తు చేశారు. మేనిఫెస్టోలో లేని సన్న బియ్యం అందిస్తున్నామని, గతంలో ఏ ప్రభుత్వమూ అందించలేదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండల స్థాయి నాయకులు వర్గాలుగా కాకుండా అందరినీ కలుపుకుని పోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు అందిస్తున్న పథకాలను విస్తృతంగా గ్రామాల్లో ప్రచారం చేయాలన్నారు. ఉద్యోగాలు రాని వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. అదేవిధంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కుట్రపూరితంగా సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై నేషనల్ హెరాల్డ్ కేసులు పెట్టడాన్ని నిరసిస్తూ మండలకేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రధాన చౌరస్తాలో నిరసన తెలిపారు. తక్షణమే వారిపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్
- సభాస్థలి పరిశీలన

ఎల్కతుర్తి: ఈనెల 27వ తేదీన చింతలపల్లి సమీపంలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు లక్షలాదిగా ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిత్తం సదానందం, నాగుర్ల వెంకన్నతో కలసి సభా స్థలిని పరిశీలించారు. సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను వంచిస్తోందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే తమకు సమన్యాయం చేకూరుతుందని, తిరిగి కేసీఆర్ పాలనను ప్రజలు కోరుకుంటున్నారని వివరించారు. కేసీఆర్ సభకు స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. సుమారు 10 లక్షల మంది తరలిరానున్నారని, వారికి కావాల్సిన సదుపాయాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు పిట్టల మహేందర్, మండల సురేందర్, గోల్లె మహేందర్, తంగెడ మహేందర్, తంగెడ నగేశ్, కడారి రాజు, దుగ్యాని సమ్మయ్య, వేముల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

- చివరి గింజ వరకూ కొంటాం
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

వేలేరు/ధర్మసాగర్: రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. గురువారం వేలేరు, ధర్మసాగర్ మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సన్నవడ్లు పండిస్తున్న రైతులకు మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇచ్చి ప్రోత్సహిస్తోందన్నారు. అధికారులు కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్లు అందుబాటులో ఉంచి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని ఆదేశించారు. రోడ్డు మీద తిరిగే ప్రతీ ఒక్కరికి సమాధానం చెప్పాల్సిన అవసరం తనకు లేదని, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంపైనే దృష్టి పెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్డీఓ మేన శ్రీను, ధర్మసాగర్ పీఏసీఎస్ చైర్మన్ గుండ్రెడ్డి రాజేశ్వర్ రెడ్డి, వైస్ చైర్మన్ యాదకుమార్, తహసీల్దార్ కోమి, ఎంపీడీఓలు లక్ష్మీప్రసన్న, అనిల్‌కుమార్, ఏఓలు కవిత, రాజేశ్, నోడల్ ఆఫీసర్ రవీందర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ యాదకుమార్, సొసైటీ డైరెక్టర్లు, నాయకులు కత్తి సంపత్, మల్లికార్జున్, బిల్లా యాదగిరి, సద్దాం హుస్సేన్, రాజిరెడ్డి, లక్ష్మణ్ నాయక్, రణధీర్‌రెడ్డి, రాజేందర్, రాజమల్లయ్య, సంపత్ తదితరులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఎల్‌సీ యాప్‌తో ప్రమాదాల నివారణ
టీజీఎన్పీడీసీఎల్ వరంగల్ ఎస్ఈ కె.గౌతంరెడ్డి

- వివరాలు 10లో▸

గంజాయి ముఠా అరెస్ట్
రూ.3.5 లక్షల విలువైన ఎండు గంజాయి స్వాధీనం

క్లుప్తంగా

19 నుంచి బునియాడీ కార్యకర్తల సమ్మేళనం


రవీందర్ నాయక్

హన్మకొండ: హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్లో ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు జరిగే బునియాడీ కార్యకర్తల సమ్మేళనం విజయవంతం చేయాలని ఆదివాసీ కాంగ్రెస్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గుగులోత్ రవీందర్ నాయక్ పిలుపునిచ్చారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ, ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు బెల్లయ్య నాయక్ ఆదేశాల మేరకు ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకులు, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, పీసీసీ డెలిగేట్లు పాల్గొంటారని వివరించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రతీ మండలం నుంచి ఆదివాసీ కాంగ్రెస్ కార్యకర్తలు ఈ సమ్మేళనంలో పాల్గొనాలని కోరారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

వరంగల్: మూడేళ్ల చిన్నారిపై అసభ్యకరంగా ప్రవర్తించిన ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ ఎం.ఎ.షుకూర్ తెలిపారు. బుధవారం రాత్రి గిర్మాజీపేటలో కిరాయికి ఉంటున్న ఓ కుటుంబానికి చెందిన మూడేళ్ల చిన్నారి తన నానమ్మ వద్ద అన్నం తిని ఇంటి ఆవరణలో అన్నయ్యతో ఆడుకుంటోంది. వీరు ఉంటున్న ఇంట్లోనే పైఅంతస్తులో కిరాయికి ఉంటూ పెయింటింగ్ వర్క్ చేసే ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన లల్లు రంజాన్.. ఇద్దరు పిల్లలను బయటకు తీసుకెళ్లి బిస్కెట్లు కొనిచ్చాడు. ఇంటికి తీసుకొచ్చి బాలికలను పైఅంతస్తులోని తన గదికి తీసుకెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ విషయం బాలిక తన నానమ్మతో చెప్పగా కుటుంబ సభ్యులు రంజాన్‌ను నిలదీయగా పరారయ్యాడు. ఈ ఘటనపై బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు రంజాన్‌పై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

వడగళ్ల వానతో పండ్ల తోటలకు నష్టం

ఖిలా వరంగల్: వరంగల్ జిల్లాలో ఇటీవల ఈదురు గాలులతో కురిసిన వడగళ్ల వానకు పండ్ల తోటలకు నష్టం వాటిల్లింది. మామిడి కాయలు రాలిపోగా, అరటి, బొప్పాయి, మునగ తోటలు నేలవాలాయి. జిల్లాలో మొత్తం 502 ఎకరాల విస్తీర్ణంలో పండ్ల తోటలు దెబ్బతిన్నాయి. ఇందులో 37 ఎకరాల మామిడి, 33 ఎకరాల అరటి తోటలు, రెండు ఎకరాల బొప్పాయితోపాటు మిగిలినవి ఇతర పంటలు ఉన్నాయి. బుధ, గురువారం వివరాలు సేకరించామని జిల్లా ఉద్యానశాఖ అధికారులు తెలిపారు.

రజతోత్సవ సభకు చకచకా ఏర్పాట్లు

ఎల్కతుర్తిలో భారీ సభ కోసం మొత్తం 1,159 ఎకరాలు
- పార్కింగ్ స్థలాలు, సభావేదిక మైదానాల చదును
- పాతికేళ్ల వేడుకల సభకు మరో పది రోజులే... రోడ్డెక్కిన ప్రచార రథాలు
- ఆవిర్భావ సభ సక్సెస్‌కు నేడో, రేపో కీలక కమిటీలు
- ఏర్పాట్లపై రోజు రెండుసార్లు అధినేత కేసీఆర్ ఆరా
- ఉమ్మడి వరంగల్ నేతలతో రేపు కేసీఆర్ భేటీ...?


ఎల్కతుర్తి సమీపం చింతలపల్లి శివారులో సభావేదిక స్థలం, బారికేడ్లతో ఏర్పాట్లు

సాక్షిప్రతినిధి, వరంగల్ : భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పాతికేళ్ల పండుగ వేడుకలకు ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. ఉద్యమ పార్టీగా బీఆర్ఎస్ (టీఆర్ఎస్) అవతరించి 25 ఏళ్లు కావొస్తున్న సందర్భంగా ఈ రజతోత్సవ వేడుకలను నాయకత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి సమీపం చింతలపల్లి శివారులో ఈ నెల 27న భారీ సభ నిర్వహిస్తోంది. పది లక్షల మందికి తగ్గకుండా జనసమీకరణ చేసి 'పబ్లిక్ మీటింగ్' నిర్వహించడానికి మార్చి 28న కాజీపేట ఏసీపీకి అనుమతి కోసం దరఖాస్తు చేశారు. అనుమతులు ఇవ్వడంలో జాప్యం జరగడంతో బీఆర్ఎస్ నేతలు హైకోర్టును ఆశ్రయించారు. ఈ నెల 12న పోలీసుల అనుమతి కూడా లభించింది. పాతికేళ్ల పండుగ వేడుకల నిర్వహణకు ఇంకా పది రోజులే ఉండటంతో శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ఏం జరుగుతోంది, పనులు ఎంతవరకు.. ఆరా తీస్తున్న అధినేత కేసీఆర్..

రజతోత్సవ వేడుకల సభ ఏర్పాట్లపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రోజూ ఆరా తీస్తున్నట్లు పార్టీవర్గాలు చెబుతున్నాయి. సభావేదిక ఏర్పాట్ల కోసం మొదట మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి పర్యటించగా.. ప్రస్తుతం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, వొడితెల సతీశ్‌కుమార్, ఉమ్మడి జిల్లా నేతలు పనులను పర్యవేక్షిస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం ఓసారి, సాయంత్రానికోసారి సభావేదిక ఏర్పాట్లపై కేసీఆర్ ఆరా తీస్తూ తగిన సూచనలు చేస్తున్నారు. ఎల్కతుర్తి, గోపాల్‌పూర్, బావుపేట, ఎల్లాపూర్, కొత్తపల్లి శివార్లలో వాహనాల పార్కింగ్ కోసం స్థలాల చదును పూర్తయ్యింది. సుమారు 50 వేల వాహనాల వరకు వస్తాయని అంచనా వేస్తున్న బీఆర్ఎస్ నేతలు.. ఆ మేరకు ఇంకా పార్కింగ్ స్థలాలను పెంచుతున్నారు. ఇదిలా ఉండగా జనసమీకరణకు ఇదివరకే ఉమ్మడి వరంగల్‌లోని 12 నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్‌లను నియమించారు. మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ఓ వైపు సభా ఏర్పాట్లను పర్యవేక్షిస్తూనే.. మరోవైపు జన సమీకరణ కోసం నియోజకవర్గాల వారీగా ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేసేందుకు 'ప్రచార రథం'లు కూడా రోడ్డెక్కాయి. కాగా, సభకు మరో పది రోజులే గడువు ఉండటంతో రెండు రోజుల్లో కీలక కమిటీలు వేయడంతోపాటు శనివారం ఉమ్మడి వరంగల్ నాయకులతో కేసీఆర్ భేటీ అయ్యే అవకాశం ఉందని పార్టీవర్గాల సమాచారం.

సమావేశ స్థలం కంటే పార్కింగ్‌కే అధికం..

ప్రతిష్టాత్మకంగా నిర్వహించే పాతికేళ్ల పండుగ వేడుకల కోసం ఎల్కతుర్తి, చింతలపల్లి, దామెర, కొత్తపల్లి, గోపాల్‌పూర్ శివార్లలో 1,159 ఎకరాల భూసేకరణ చేశారు. ఇందుకోసం రైతులు స్వచ్ఛందంగా అనుమతి పత్రాలు ఇచ్చినట్లు బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు. పోలీసులకు అనుమతి కోసం చేసిన వినతిపత్రంలో సమావేశానికి 159 ఎకరాలు, పార్కింగ్ కోసం 1000 ఎకరాలు సేకరించినట్లు స్పష్టం చేశారు. వరంగల్ – కరీంనగర్, సిద్దిపేట – వరంగల్, యాదాద్రి భువనగిరి – ఆరెపల్లి (భూపాలపట్నం)... మూడు జాతీయ రహదారులకు కేంద్రంగా ఉన్న ఎల్కతుర్తి, దాని పరిసర ప్రాంతాల్లో పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నారు. ఎల్కతుర్తి మండల కేంద్రాన్ని ఆనుకుని ఉన్న చింతలపల్లి శివారులో సభావేదిక, సమావేశానికి హాజరయ్యే ప్రజల కోసం కుర్చీలు, షామియానాలను వేసేందుకు భూమి చదును పనులు పూర్తి దశకు చేరుకుంటున్నాయి. లక్షల్లో జనం హాజరయ్యే అవకాశం ఉన్నందున నిఘా కోసం తగినన్ని సీసీ కెమెరాలు, పటిష్టమైన బారికేడ్లను ఏర్పాటు చేసేందుకు వీలుగా మ్యాపింగ్ చేస్తున్నారు.

వ్యభిచార ముఠా గుట్టు రట్టు

- నిర్వాహకురాలు, ముగ్గురు విటుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన టాస్క్‌ఫోర్స్ ఏసీపీ


ముఠా వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లను చూపుతున్న ఎస్సై అరుణ్

నర్సంపేట రూరల్ : వ్యభిచార ముఠా గుట్టు రట్టు అయ్యింది. విశ్వసనీయ సమాచారం మేరకు వ్యభిచారం నిర్వహిస్తున్న ఇంటిపై దాడిచేసి నిర్వాహకురాలితోపాటు ముగ్గురు విటులను అరెస్ట్ చేసి ఇద్దరు మహిళలను కాపాడినట్లు వరంగల్ టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ కథనం ప్రకారం.. నర్సంపేటలోని మాధన్నపేట రోడ్డులో ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు వరంగల్ టాస్క్‌ఫోర్స్, నర్సంపేట పోలీసుల ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఇందులో ముగ్గురు విటులు నర్సంపేటకు చెందిన కేసనపల్లి విక్రమ్, బానోజీపేటకు చెందిన కొయ్యల రమేశ్, కొయ్యల నితిన్, గృహ నిర్వాహకురాలు మాధన్నపేట రోడ్డులోని సీపీఐ కాలనీ చెందిన కన్నెరపు ఉమ పట్టుబడ్డారు. దీంతో వారిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 5 సెల్‌ఫోన్లు, రూ. 2,750 నగదు, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీధర్, నర్సంపేట ఎస్సై అరుణ్, హెడ్‌కానిస్టేబుల్ రాజేశ్వరి, కానిస్టేబుళ్లు కృష్ణ, రాజు, నరేశ్, గణేశ్ పాల్గొన్నారు.

దక్కన్ క్వీన్ అందాలు జిగేల్..



విద్యుత్ కాంతులతో మెరుస్తున్న దక్కన్‌క్వీన్

వరల్డ్ హెరిటేజ్ డే సందర్భంగా ముస్తాబు
- పెయింటింగ్, లైటింగ్స్‌తో కలర్‌ఫుల్‌గా స్టీమ్‌లోకో..
- ప్రొజెక్టర్ ద్వారా రైల్వే చరిత్ర ప్రదర్శన

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ ఎదుట రైల్వే చరిత్ర తెలుసుకోవడానికి ఏర్పాటు చేసిన మొదటి తరం రైల్వే స్టీమ్ లోకోమోటివ్‌ను (కాజీపేట జంక్షన్ ఎదుట ఏర్పాటు చేసినప్పుడు లోకోకు చేసిన నామకరణం హెరిటేజ్ దక్కన్ క్వీన్) రైల్వే అధికారులు గురువారం సుందరీకరించారు. శుక్రవారం ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా డీజిల్‌లోకోషెడ్ సీనియర్ డీఎంఈ ఎన్.వి.వెంకటకుమార్, డీఎంఈ అనికేత్ కాడే పర్యవేక్షణలో 15 మంది రైల్వే సిబ్బంది పెయింటింగ్, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి స్టీమ్ లోకోను సుందరంగా అలంకరించినట్లు ఏఆర్‌టీ ఎస్ ఎస్ఈ పి.చంద్రశేఖర్ తెలిపారు. స్క్రీన్ ఏర్పాటు చేసి ప్రొజెక్టర్ ద్వారా భారతీయ రైల్వే చరిత్ర, స్టీమ్ లోకోమోటివ్ విశేషాలను ప్రదర్శించగా ప్రయాణికులు ఆసక్తిగా తిలకించారు. కాగా, విద్యుత్ కాంతుల మధ్య దక్కన్ క్వీన్ జిగేల్ మంటోంది. దీంతో ప్రయాణికులు ఫొటోలు తీసుకుంటూ సందడి చేశారు. దక్కన్‌క్వీన్ కొత్త అందాలతో కాజీపేట జంక్షన్ శోభాయమానంగా మారింది.

గంజాయి ముఠా అరెస్ట్

- రూ.3.5 లక్షల విలువైన ఎండు గంజాయి స్వాధీనం


నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

పరకాల: సిగరెట్లలో గంజాయి పెట్టి విక్రయించాలనే ఆలోచనతో ఒడిశా నుంచి సరుకు దిగుమతి చేసి పరకాలలో విక్రయించేందుకు సిద్ధమైన ముఠాను పరకాల పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. సీఐ క్రాంతికుమార్ కథనం ప్రకారం.. పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా పశువుల సంతలో ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతోపాటు అక్కడి నుంచి పరుగులు పెట్టారు. దీంతో అదుపులోకి తీసుకున్న పోలీసులు అనుమానితుల వద్ద ఉన్న బ్యాగులను తనిఖీ చేయగా రూ.3లక్షల 5వేల విలువైన 6.11 కిలోల ఎండుగంజాయి లభ్యమైంది. దీంతో ఒడిశాకు చెందిన శంకుభర సగారియా(మేస్త్రీ), ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన దరగోపాల్ యాదవ్(మేస్త్రీ), పరకాలలోని మల్లారెడ్డిపల్లెకు చెందిన ఒంటేరు రాజ్‌కుమార్(ల్యాబ్ టెక్నీషియన్)ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై శివక్రిష్ణ, హెడ్ కానిస్టేబుళ్లు టి.సర్వర్, ఎస్.నరసింగం, డి.నాగరాజు, ఎస్.నాగరాజు, ఎ.శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

వెట్‌ల్యాండ్ ఎకో పార్క్‌ను సందర్శించిన కమిషనర్


వెట్‌ల్యాండ్ ఏకో పార్కులో కమిషనర్ వాకడే

వరంగల్: 'స్పాంజ్ పార్క్ ఫ్రేమ్ వర్క్ ఫర్ రెసిలెంట్ ఓపెన్ స్పేసెస్'పై సామర్థ్య అభివృద్ధి శిక్షణలో రెండో రోజు గురువారం సైతం కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే పాల్గొన్నారు. చెన్నైలోని ఎంఎస్.స్వామినాథన్ వెట్‌ల్యాండ్ ఎకో పార్క్‌ను క్షేత్రస్థాయిలో సందర్శించారు. అక్కడి అధికారులు పార్కులో వరద నీటి ప్రవాహం వెళ్లే ప్రక్రియ, ఆవర్తన డీసిల్టింగ్ విధానంతో పేరుకుపోయిన బురద తొలగించడం తదితర అంశాలను వివరించారు.

20 నుంచి 'ఓపెన్' పరీక్షలు

విద్యారణ్యపురి : హనుమకొండ జిల్లాలో ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షలు ఈనెల 20నుంచి 26వతేదీ వరకు నిర్వహించనున్నట్లు డీఈఓ డి వాసంతి, ఉమ్మడి వరంగల్‌జిల్లా కోఆర్డినేటర్ ఎ. సదానందం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ జిల్లాలో ఆరు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు.అయితే పరకాలలోని జిల్లా పరిషత్ (బాలుర) హైస్కూల్ పరీక్ష కేంద్రానికి అనుబంధంగా ఆ పరీక్ష కేంద్రానికి దగ్గరలోనే ఎస్ఆర్ స్కూల్‌లో కూడా మరో కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. పరకాల జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో హాల్‌టికెట్ నంబర్ 2412130037 నుంచి 2412130187 వరకు గల విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సింటుందని తెలిపారు. పరకాలలోని ఎస్ఆర్ స్కూల్ పరీక్ష కేంద్రంలో హాల్‌టికెట్ నంబర్ 2412130188 నుంచి 2412130380వరకు గల విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాలన్నారు. ఆయా విద్యార్థులు ఒకరోజు ముందుగా పరీక్ష కేంద్రానికి వెళ్లి నిర్ధారించుకోవాలని వారు సూచించారు.

20న అండర్-7 జిల్లా స్థాయి చెస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్-07 చదరంగ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు టోర్నమెంట్ నిర్వహణ కార్యదర్శి పి. కన్నా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ నక్కలగుట్టలోని ఎస్ఎంఆర్ హైస్కూల్‌లో ఎంపిక పోటీలు ఉంటాయని తెలిపారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులు జనవరి01, 2018, ఆ తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. ఇందులో గెలుపొందిన నలుగురు బాలురు, నలుగురు బాలికలను మే నెలలో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు పేర్లు రిజిస్ట్రేషన్‌కు 90595 22986 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

మిర్చి కొనుగోళ్ల వివరాలు సేకరణ


మార్కెట్ కార్యదర్శితో మాట్లాడుతున్న జీఎస్టీ అధికారులు

వరంగల్: ఏనుమాములలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్లు చేసిన కమీషన్ వ్యాపారుల వివరాలను జీఎస్టీ అధికారులు సేకరిస్తున్నారు. గురువారం జీఎస్టీ అధికారులు శ్రీధర్, గోపి మార్కెట్ కార్యాలయానికి వచ్చి కార్యదర్శి జి.రెడ్డితో భేటీ అయ్యారు. మార్కెట్ ఫీజులు చెల్లించిన వ్యాపారులు జీఎస్టీ చెల్లించకపోవడం, ఏమేరకు సరుకులు ఖరీదు చేశారన్న వివరాలు తెలియకపోవడంతో అధికారులు కార్యాలయానికి వచ్చినట్లు తెలిసింది. వ్యాపారులు తాము కొనుగోలు చేసిన సరుకులకు ఒక శాతం మార్కెట్ ఫీజులు చెల్లించారు. ఈ ప్రకారం వ్యాపారులు తాము విక్రయించిన సరుకులకు 5శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. ఈ వివరాలు అందిన వెంటనే సదరు వ్యాపారులకు జీఎస్టీ అధికారులు నోటీసులు జారీ చేస్తారని తెలిసింది.

స్తంభాన్ని ఢీకొన్న లారీ

- ధర్మారంలో ఐదు గంటలపాటు నిలిచిన విద్యుత్ సరఫరా

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారం శివారులోని వరంగల్–నర్సంపేట రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని గురువారం లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో విద్యుత్ తీగలు తెగిపోగా.. గొర్రెకుంట సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సుమారు 5 గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయి వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గొర్రెకుంట సబ్‌స్టేషన్ ఏఈ దిలీప్ తన సిబ్బందితో కలిసి తీగలను సరి చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. స్థానిక శివ రోలర్ ఫ్లోర్ మిల్లులోకి లోడ్‌లతో వచ్చిపోయే లారీలు తరచు స్తంభాలను ఢీకొనడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోతోందని స్థానికులు పేర్కొన్నారు.

నిరంతరం కష్టపడితేనే విజయం

- కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న వీసీ కె. ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్ : నిరంతరం కష్టపడితేనే విజయం వరిస్తుందని కాకతీయ యూనివర్సిటీ వీసీ కె. ప్రతాప్ రెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో గురువారం యూనివర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ టి.మనోహర్ అధ్యక్షతన నిర్వహించిన యూనివర్సిటీ కాలేజీ వార్షిక స్పోర్ట్స్ అండ్ కల్చరల్ డేలో వీసీ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కష్టించే తత్వం, పట్టుదల, అకడమిక్‌పై పట్టు, పెద్ద లక్ష్యం, జీవన నైపుణ్యాలు విజయమార్గాన్ని సుగమం చేస్తాయన్నారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా విద్యార్థి దశలో అవసరమన్నారు. గౌరవ అతిథి, ప్రముఖ సినీ గేయ రచయత, గాయకుడు మిట్టపల్లి సురేందర్ మాట్లాడుతూ విద్యార్థులతోనే సమాజ మార్పు సాధ్యమన్నారు. రైతులు, తల్లిదండ్రులు, గురువుల పట్ల కృతజ్ఞతభావం ఉండాలన్నారు. మరో గౌరవ అతిథి, ఇండియన్ కబడ్డీ టీం పూర్వపు హెడ్ కోచ్ లింగంపల్లి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ చదువుకు టాలెంట్‌కు సంబంధం లేదు అన్నారు. చదువుతోపాటు క్రీడలపై కూడా ఆసక్తి పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు బి. సురేశ్ లాల్, ఎన్. సుదర్శన్, బి. రమ, బి. సుకుమారి, ఎం.నవీన్, చిర్రరాజు, కె. అనితారెడ్డి, పుల్లూరి సుధాకర్, కేయూ స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ వై. వెంకయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా, క్యాంపస్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ మమత వందన సమర్పణ గావించారు.

నేషనల్ హెరాల్డ్ కేసు రాజకీయ ప్రతీకారమే


నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే నాయిని

హన్మకొండ చౌరస్తా: కేంద్రంలోని బీజేపీ సర్కార్ దర్యాప్తు సంస్థలను అడ్డుపెట్టుకుని రాజకీయ ప్రతీకారానికి దిగుతోందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్‌గాంధీల పేర్లు చార్జ్‌షీట్‌లో నమోదు చేయడాన్ని తీవ్రంగా నిరసిస్తూ గురువారం హనుమకొండలోని అశోకా జంక్షన్‌లో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ సోనియా, రాహుల్, ఇతర అగ్రనేతలపై చార్జ్‌షీట్ దాఖలు చేయడమంటే ప్రభుత్వం తన అధికారాలను దుర్వినియోగం చేయడమేనన్నారు. ప్రజాస్వామ్యబద్ధమైన విపక్ష పార్టీపై దాడి చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదన్నారు. కార్యక్రమంలో ఎంపీ కావ్య, టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాసరావు, ఈవీ శ్రీనివాసరావు, బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, జక్కుల రవీందర్, విజయశ్రీరజాలీ, మామిండ్ల రాజు మాజీ కార్పొరేటర్లు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

చార్జ్‌షీట్ నుంచి పేర్లు తొలగించాలి

- కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ


ధర్నాలో మాట్లాడుతున్న కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ

ఖిలా వరంగల్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ధ్వజమెత్తారు. నేషనల్ హెరాల్డ్ పత్రిక అంశంలో సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ పేర్లను ఈడీ చార్జ్‌షీట్‌లో నమోదు చేయడం సరికాదని ఆమె అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆదేశాల మేరకు గురువారం వరంగల్ హెడ్‌పోస్టాఫీస్ జంక్షన్‌లో కాంగ్రెస్ నాయకులు గురువారం ధర్నా నిర్వహించారు. చార్జ్‌షీట్ నుంచి సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ పేర్లు వెంటనే తొలిగించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం స్వర్ణ మాట్లాడుతూ పాదయాత్ర చేసి ప్రజల మన్ననలు పొందిన రాహుల్‌గాంధీపై బీజేపీ నాయకులు అక్రమ కేసులు పెట్టించారని ఆరోపించారు. కార్పొరేటర్లు గుండేటి నరేందర్, బస్వరాజు శిరీషశ్రీమాన్, నాయకులు దామెర సర్వేశం, బిల్లా శ్రీకాంత్, దూపం సంపత్, జన్ను రవి, జన్ను అరుణ్, పరమేశ్, ఎండీ సలీం, రాజనాల శ్రీహరి, గోరంటల రాజు, చాగంటి శ్రీనివాస్, బాలరాజు, యాదగిరి, బాబు, చంద్రమౌళి, ఇమ్రాన్, కొమురయ్య, చిరంజీవి, సతీశ్, ఉమేందర్, ప్రభాకర్,కార్యకర్తలు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎల్ఆర్ఎస్ అమలు


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద, అధికారులు

వరంగల్: వరంగల్ జిల్లాలో ఎల్ఆర్ఎస్‌ను పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ సత్యశారద తెలిపారు. రాష్ట్ర పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్ గురువారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎల్ఆర్ఎస్ పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని జీడబ్ల్యూఎంసీ, నర్సంపేట, వర్ధన్నపేట మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో 41,754 దరఖాస్తులు రాగా.. 24,699 దరఖాస్తులకు మంజూరు చేశామని చెప్పారు. 5,787 మంది రూ.107.61 కోట్ల ఫీజులు చెల్లించగా.. 382 మందికి ప్రొసీడింగ్‌లు అందజేశామని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్ఓ విజయలక్ష్మి, డీపీఓ అనురాధ, డీటీసీపీ జ్యోతి, అధికారులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ సర్టిఫికెట్ల అందజేత

కాజీపేట అర్బన్: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) వరంగల్ విద్యార్థులకు ఇటీవల నిర్వహించిన ఎన్‌సీసీ సర్టిఫికెట్ పరీక్షల్లో ఉత్తర్ణులై ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు గురువారం క్యాంపస్ ప్రాంగణంలో 1(టీ) సీటీఆర్ ఎన్‌సీసీ వరంగల్ యూనిట్ కమాండింగ్ ఆఫీసర్, ఇన్‌చార్జ్ లెఫ్టినెంట్ కర్నల్ విజయ్‌కుమార్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. 17 మంది బీటెక్ సెకండియర్ విద్యార్థులు ఎన్‌సీసీ బీ–సర్టిఫికెట్, 6 మంది బీటెక్ థర్డ్ ఇయర్ విద్యార్థులు ఎన్‌సీసీ సీ–సర్టిఫికెట్ పొందారని వివరించారు. చాలా మంది ఏ గ్రేడ్ సాధించగా, మిగతా వారు బీ గ్రేడ్ సాధించినట్లు తెలిపారు.

ఎల్‌సీ యాప్‌తో ప్రమాదాల నివారణ


- టీజీఎన్పీడీసీఎల్ వరంగల్ ఎస్ఈ కె.గౌతం రెడ్డి


సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న వరంగల్ ఎస్ఈ కె.గౌతం రెడ్డి, డీఈలు

హన్మకొండ: ప్రమాదాల నివారణ, ఉద్యోగుల భద్రతను దృష్టిలో ఉంచుకుని టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం ఎల్‌సీ యాప్‌ను రూపొందించిందని కంపెనీ వరంగల్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.గౌతం రెడ్డి అన్నారు. గురువారం వరంగల్ ఆజంజాహి మిల్ సబ్ స్టేషన్‌లో ఎల్‌సీ యాప్‌ను ప్రారంభించి అమలు చేశారు. విద్యుత్ సంబంధ మరమ్మతులు చేస్తున్న క్రమంలో లైన్ క్లియర్ తీసుకుంటామని, ఒక్కోసారి సమాచార లోపంతో ప్రమాదాలు జరిగేవన్నారు. వీటిని అరికట్టేందుకు ఎల్‌సీ యాప్‌ను తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ యాప్ ద్వారా ఎల్‌సీ తీసుకోవాలంటే సంపూర్ణ సమాచారం పొందుపరుచాల్సి ఉంటుందన్నారు. ఈ సమాచారాన్ని పరిశీలించి ఎల్‌సీ తీసుకుని పనులు చేపట్టడం ద్వారా ప్రమాదాల నివారించొచ్చన్నారు. ఇప్పటి నుంచి వరంగల్ టౌన్ డివిజన్‌లో ఎల్‌సీ యాప్‌ను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇక నుంచి యాప్ ద్వారానే ఎల్‌సీ తీసుకోవాలని అధికారులు, ఉద్యోగులకు సూచించారు. కార్యక్రమంలో డీఈలు ఎ.ఆనందం, ఎస్.మల్లికార్జున్, ఏడీ బి.కిశోర్, ఏఈ సి.హెచ్.సాయి కృష్ణ, సబ్ ఇంజనీర్లు సురేశ్, విజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమించాలి

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి


మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

హన్మకొండ చౌరస్తా: మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పూలే–అంబేడ్కర్ యాదిలో–మహిళల హక్కుల పరిరక్షణ యాత్ర గురువారం హనుమకొండకు చేరుకుంది. ఈబస్సు యాత్రకు ఐద్వా జిల్లా కమిటీ, వివిధ ప్రజా సంఘాల బాధ్యులు వేయిస్తంభాల గుడి వద్ద బోనాలు, డప్పుచప్పుళ్లు, బతుకమ్మలతో ఘన స్వాగతం పలికారు. వేయి స్తంభాల గుడి నుంచి హనుమకొండ చౌరస్తా మీదుగా సాగిన ప్రదర్శనలో మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. రాజ్యాంగంలో మహిళలకు సమాన హక్కులు కల్పించినప్పటికీ స్త్రీ, పురుషుల మధ్య అసమానత్వం కొనసాగుతోందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో స్త్రీల హక్కుల కోసం పోరాటాలు సాగిస్తామన్నారు. 'ఐద్వా' జిల్లా సహాయ కార్యదర్శి ఎం.రమాదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐద్వా నాయకులు ఆశాలత, రత్నమాల, సాయిలీల, రామతార, శ్వేత, రాధికారాణి, అనిత, రాధ, పుష్ప, సీఐటీయూ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, ఉప్పలయ్య, చక్రపాణి, రజిత, గిరిజన సంఘం నాయకులు వీరన్న, మత్స్యకార్మిక సంఘం నాయకులు వెంకట్, కేవీపీఎస్ బాధ్యులు సాంబయ్య, సంపత్, డీవైఎఫ్ఐ బాధ్యులు కిశోర్ తదితరులు పాల్గొన్నారు.